క్లుప్తంగా

శేషవాహనంపై గ్రామోత్సవం



బలభద్రపురంలో శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శేష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం సుప్రభాతసేవ, లఘు అర్చన, తోమాలసేవ, పంచామృతాభిషేకం, గోపూజ, పవళింపు సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై గ్రామోత్సవం చేశారు. వేంకటేశ్వర వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి



సీతానగరంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సీతానగరం: సీతానగరంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బత్తిన వీరాంజనేయులు మాట్లాడుతూ దేశాభివృద్ధికి వాజ్‌పేయి అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అనంతరం పార్టీ నాయకుడు మద్దాల కొండలరావు ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. పార్టీ జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శి ఖండవల్లి సాయి, మండల ఉపాధ్యక్షుడు సత్యం రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పెరుగు శ్రీనివాస్, మహిళ మోర్చా అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, న్యాయవాది లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతి ప్రతుల దహనం

సీటీఆర్ఐ: కుల వివక్షకు, అసమానతలకు కారణమైన మనుస్మృతి ప్రతులను బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. తొలుత స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ఆదరిస్తే అధరహో

- అయిల్‌పామ్ ధర స్థిరత్వానికి డిమాండ్
- నిలకడ లేని విధానాలతో ఇబ్బందులు
- ప్రభుత్వం పట్టించుకోవాలని రైతుల మొర



బూరుగుపూడిలో బిందు సేద్యానికి అనువుగా తయారైన ఆయిల్‌పామ్ తోట



మధురపూడిలోని ఆయిల్‌పామ్ మొక్కలు

మధురపూడి: విత్తు నుంచి పంట విక్రయం వరకూ రైతన్నలకు అడుగడుగునా కష్టాలే.. అలాంటి కర్షకులకు ఆదరణ ఉంటే సాగు బంగారమే.. ప్రస్తుతం ఆయిల్‌పామ్ పంట బాగున్నా, మద్దతు ధర కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. మార్కెట్‌లో నూనె ధరలు ఆకాశాన్నంటినా ఆయిల్‌పామ్‌కు మాత్రం గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తోటలు తూర్పుగోదావరి జిల్లాలో 41,218 ఎకరాలుంటే, రాజానగరం నియోజకవర్గంలో 5,962.59 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఎకరానికి 57 మొక్కలు ఉంటుండగా, వీటి ద్వారా ఏటా 12 నుంచి 13 టన్నుల దిగుబడి వస్తోంది. కాగా ప్రాథమిక దశలో నీటి సదుపాయం లేకపోతే దిగుబడి తగ్గిపోతుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్రం తరహాలో మద్దతు ధర కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని వారు కోరుతున్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ.19,500 నుంచి రూ.20,250 వరకూ పలుకుతోంది. అయితే ధర స్థిరంగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కౌలు రైతులకు ఇది మరింత సమస్యగా మారింది. అష్టకష్టాలు పడి అప్పులు చేసి పంటలు పండించినా ఇబ్బందులు పడాల్సి వస్తోందని పుడమిపుత్రులు వాపోతున్నారు. పామాయిల్ తోటల ద్వారా ఆదాయం వస్తోందన్న ఆశతో ప్రతి ఏటా సాగుకు ఉపక్రమిస్తున్న రైతుకు నిరాశే మిగులుతోంది. ఏటా ఏప్రిల్ నుంచి దిగుబడి పెరుగుతోంది. ఆ సమయంలో ధర ఆశాజనకంగా లేక నిరాశే మిగులుతోంది. ధర నిలకడగా ఉంచాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధరల స్థిరత్వం లేక..

ధరల స్థిరత్వం లేక ఇబ్బందులు పడుతున్న ఆయిల్‌పామ్ రైతులు నవంబర్ నుంచి అక్టోబర్ వరకూ ఆయిల్‌పామ్ సంవత్సరంగా ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు. ఏటా ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ ఆయిల్‌పామ్ దిగుబడి వస్తోంది. అయితే నవంబర్ నుంచి మార్చి వరకూ అన్‌సీజన్. ఈ కాలంలో దిగుబడి తగ్గుతోంది. కాగా ధర కూడా తగ్గిపోతుంది. పెరుగుదల, తగ్గుదల నేపథ్యంలో నిర్దిష్టమైన ధర ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ విధానాలతో రైతాంగం అవస్థలు ఎదుర్కొంటుంది. అన్ సీజన్‌లో ధర పెంచి, సీజన్‌లో తగ్గిస్తోంది. దీనివల్ల రైతులకు నష్టం చేకూర్చి, పలు కంపెనీలకు మేలు చేస్తోంది.

తోటల పెంపకానికి రాయితీలు



అయిల్‌పామ్ తోటల పెంపకానికి **ప్రభుత్వం రాయితీల**ను అందిస్తోంది. **జిల్లాలోని** నాలుగు **ఆయిల్ పామ్ కంపెనీల ద్వారా** మొక్కలను **అందజేస్తుంది. అవి** పెద్దాపురంలో పతాంజలి **ఆయిల్ ఫుడ్స్, జంగా**రెడ్డిగూడేనికి చెందిన నవభా**రత్ కంపెనీ, యర్న**గూడేనికి చెందిన త్రీ ఎఫ్ కంపె**నీ, రావులపాలెంలో**ని సర్వేసాయి ఆయిల్‌పామ్ **కంపెనీల ద్వారా మొ**క్కలను నూరుశాతం రాయి**తీతో అందిస్తున్నాం.** అలాగే బిందు సేద్యం విధా**నంలో ఐదెకరాల లో**పు పండ్ల తోటలున్న రైతులకు 90 శాతం, ఐదెకరాలకు మించిన తోటలున్న రైతులకు 50 శాతం రాయితీ ఇస్తున్నాం.

–బి.సుజాతకుమారి, జిల్లా ఉద్యాన శాఖాధికారి, రాజమహేంద్రవరం

ధర స్థిరంగా ఉంచాలి



అన్‌సీజన్‌లో ఆయిల్‌పామ్ ధరను తగ్గించకుండా ధర స్థిరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. రైతు పక్షపాతిగా వ్యవహరిస్తానన్న కూటమి ప్రభుత్వం దానికి తిలోదకాలు ఇచ్చింది. ధర స్థిరంగా ఉంచాలని గెలలను తీసుకునే కంపెనీలకు ఆదేశాలివ్వాలి. తద్వారా సాగు ఇబ్బంది లేకుండా సాగుతోంది.

– కర్రి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు, కోరుకొండ

మాజీ ఎమ్మెల్యే రాజా పరామర్శ



ఉండేశ్వరపురంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజా

సీతానగరం/ రాజానగరం: ఉండేశ్వరపురంలో పలు కుటుంబాలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. ఇటీవల కారంకి కృష్ణ ప్రమాదంలో మరణించగా అతని కుటుంబ సభ్యులను, సుద్దపల్లి సూర్యారావు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను జక్కంపూడి రాజా పరామర్శించారు. సర్పంచ్ మాకాల ఈశ్వరరావు, మాకాల సూరిబాబు, వేమగిరి నాగమునేష్, రుద్ర బాబూరావు, ఓరింకల నాగేశ్వరరావు, పాముల మురళీ తదితరులు ఉన్నారు. తండ్రి మృతితో బాధపడుతున్న పాలచర్లకు చెందిన రావిపాటి శ్రీను, కొత్తవెలుగుబందకు చెందిన ప్రగడ శ్రీను, చక్రద్వారబంధంలో అయ్యల విష్ణు, ముక్కినాడలో అన్నదాసు ఆదినారాయణరావు కుటుంబ సభ్యులను వారి ఇళ్లకు వెళ్లి రాజా పరామర్శించారు.

గుర్తుకొచ్చిన మధుర జ్ఞాపకాలు



1981-82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రంగంపేట: వారంతా ఎన్నో ఏళ్ల క్రితం కలిసి చదువులు సాగించారు. చదువులు పూర్తయిన తర్వాత ఉన్నత చదువుల కోసం ఎవరి మార్గంలో వారు వెళ్లిపోయారు. అనంతరం వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. దాదాపు 40 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న 1981–82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం ఓ చోట చేరి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలలో మునిగితేలారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు సమావేశానికి హాజరయ్యారు. స్నేహం మనుషుల మధ్య ఆత్మీయతను పెంచుతుందన్నారు. స్నేహం విలువ తెలుసుకొని ప్రేమాభిమానాలతో గడపడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సరస్వతీ మాత, గణేష్ విగ్రహాలకు పూల మాలలు వేసి పూజలు చేశారు. అనంతరం అకాల మరణం చెందిన చెందిన పూర్వ విద్యార్థులను స్మరించుకుంటూ మౌనం పాటించి నివాళులు అర్పించారు. సహపంక్తి భోజనాలు చేశారు.

పరశురామ అవతారంలో జనార్దనుడు



ప్రత్యేక అలంకరణలో జనార్దనస్వామి

ధవళేశ్వరం: ధనుర్మాసం సందర్భంగా ధవళేశ్వరం గ్రామంలోని వేంచేసియున్న శ్రీలక్ష్మీజనార్దన స్వామి బుధవారం పరశురామ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు (కాసులు), పవన్‌కుమార్ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ముంపు నీట.. పంట

- నష్టాల్లో మొక్కజొన్న, జొన్న రైతులు
- పట్టించుకోని సాగునీటి సంఘాలు



రాపాక - కోటికేశవరం రోడ్డులో ముంపులోకి వెళ్లిన మొక్కజొన్న పంట

సీతానగరం: అన్నదాతకు కష్టమొచ్చింది.. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ముంపులోకి వెళ్లింది.. సీతానగరం మండలం రాపాకలో జొన్న, మొక్కజొన్న పంటలను ముంపు చుట్టుముట్టింది. రాపాక– కోటికేశవరం రోడ్డులో సుమారు ఇరవై ఎకరాలు మిగులు జలాలతో ముంపులోకి వెళ్లాయి. కోతులమెట్ట వద్ద తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ సైఫాన్ నుంచి నీరు పొంగి పంట పొలాల్లోకి వచ్చి, అక్కడ నుంచి చినకొండేపూడి అప్పన్నబాబు చావిడి వద్ద నుంచి మురుగు కాలువలో కలుస్తుంది. రాపాక– కోటికేశవరం రోడ్డు వద్ద మురుకు కాలువ నుంచి అధిక నీరు పంట పొలాలను ముంచేసింది. దీంతో సుమారు పాతిక ఎకరాలు మొక్కజొన్న, జొన్న పంటలు ముంపులోకి చేరుకున్నాయి. రాపాకకు చెందిన కౌలు రైతులు తోట శ్రీనివాసరావు, తోట వెంకట్రావు, తోట మారాజు, తోట అప్పన్నబాబు, కన్నిశెట్టి సత్యనారాయణ, బావిశెట్టి రాహుల్ తదితరులకు చెందిన పంటలు నీట మునిగాయి. సంబంధిత సాగునీటి సంఘాల వారికి తెలియజేసినా పట్టించుకోలేదని వారు వాపోయారు. సైఫాన్ వద్ద రెగ్యులేటర్ నుంచి నీరు విడుదల తగ్గిస్తే రాపాక వద్ద పంట పొలాలు ముంపులోకి వెళ్లేవి కావని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.25 వేలు శిస్తు చెల్లించామని, మొక్కజొన్న పంట వేసి నెల రోజులు అయ్యిందని, ఇప్పటి వరకూ ఎకరానికి రూ.23 వేల పెట్టుబడి పెట్టామన్నారు. పొలంలోకి చేరిన నీరు బయటకు వెళ్లాలంటే సుమారు పదిహేను రోజుల సమయం పడుతుందన్నారు. వేసిన మొక్కజొన్న, జొన్న మొక్కలు నీరు నిలువ ఉండటంతో వేర్లు జల్లువదిలి వారం రోజుల్లో మొక్కలు కుళ్లిపోతాయని కౌలు రైతులు విచారం వ్యక్తం చేశారు. సంబంధిత సాగునీటి సంఘం అధ్యక్షుడికి రెండు రోజులు ఫోన్ చేసి, నీటి విడుదల తగ్గించాలని కోరినా పట్టించుకోలేదని తోట శ్రీనివాసరావు అన్నారు. కాలువపై ఉన్న రెగ్యులేటర్ నుంచి తక్కువ నీటిని విడుదల చేసి ఉంటే తమ పంటలు నీట మునిగేవి కాదని కౌలు రైతులు వాపోయారు. పొలాలు శిస్తుకు తీసుకుని, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, పొలాలు ముంపులోకి వెళ్లాయని, అంతా నష్టమే మిగిలిందని కంటతడి పెట్టారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ముంపులోకి రెండెకరాలు



రాపాక వద్ద మురుగు కాలువ దగ్గరలో శిస్తుకు తీసుకున్న రెండెకరాల మొక్కజొన్న పంట నీట మునిగింది. నెల రోజుల కిందట పంట వేశాను. ఎకరానికి రూ.23 వేల పెట్టుబడి పెట్టాను. మురుగు కాలువ నుంచి మిగులు జలాలు పంట పొలాన్ని ముంచేసింది. సాగునీటి సంఘం అధ్యక్షునికి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో రెండు ఎకరాలు నీట మునిగి నష్టపోయాను. అప్పు చేసి పెట్టుబడులు పెట్టాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

–తోట శ్రీనివాసరావు, రాపాక, రైతు

పెరటి మొక్క... ఎంచక్కా

- సేంద్రియ సాగుతో ఆరోగ్యం
- కూరగాయల వ్యర్థాలతో ఎరువుల ఉత్పత్తి
- ఇంట్లోనే సాగు చేస్తున్న మహిళలు



సేంద్రియ ఎరువు తయారీలో శిక్షణ ఇస్తున్న సిబ్బంది

సీటీఆర్ఐ: మనం తినే ఆహారం విషతుల్యంగా మారింది.. విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగమే అందుకు కారణం.. ఈ నేపథ్యంలో సేంద్రియ సాగుకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. చాలామంది తమ ఇళ్ల, పెరట్లో కూరగాయల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. వివిధ మొక్కలు, పాదులు పెట్టి వాటిని చాలా శ్రద్ధగా పెంచుతున్నారు. అయితే వాటిని ఎంత జాగ్రత్తగా పెంచినా ఎరువులు వేయకుంటే పోషకాలు సక్రమంగా అందవు. దీంతో సేంద్రియ ఎరువు తయారీకి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. రోజూ ఇంట్లో ఉపయోగించే కూరగాయల వ్యర్థాలతో మంచి ఎరువు తయారు చేసేలా మహిళలకు శిక్షణ ఇచ్చింది. దీనివల్ల మొక్కలు పెంచడానికి అవసరమైన ఎరువును ఎవరికి వారే ఇళ్లలో తయారు చేసుకుంటున్నారు. అందుకే పెట్టుబడి లేని ఆదాయం కోసం మహిళలు ఇప్పుడు ఇంటి ఆవరణలోనే గార్డెనింగ్ ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని సొంతానికి వాడుకుంటూ, ఇతరులకూ విక్రయిస్తున్నారు. కూరగాయలు పండించడానికి సేంద్రియ ఎరువులు అవసరమవుతాయి. వీటిని కొనుగోలు చేయడానికి కొంత సొమ్ము ఖర్చు చేయాల్సి వస్తుంది. దీనికోసం కార్పొరేషన్ వినూత్న పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇంట్లో వ్యర్థ పదార్థాల ద్వారా ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులు తయారు చేసుకోనే విధంగా మహిళలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. మహిళలు ఇంట్లోనే హోం కంపోస్టును తయారు చేసుకుంటున్నారు.

కూరగాయల పెంపకం.. ఆదాయం

ప్రతి ఒక్కరూ ఇప్పుడు మొక్కల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంట్లో ఏ మాత్రం ఖాళీ ప్రదేశం కనిపించినా అక్కడ మొక్కలు నాటుతున్నారు. అంతే కాకుండా గార్డెనింగ్‌లోనూ, డాబాపై పూల మొక్కలు, కూరగాయలు వంటివి సొంతంగా పండించుకుంటున్నారు. మహిళలు సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను వారే స్వయంగా విక్రయిస్తున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి వాజ్‌పేయి



రంగంపేటలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



జి.మామిడాడలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెదపూడి: మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను జి.మామిడాడ గ్రామ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకులు వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి హరినారాయణరెడ్డి, నియోజకవర్గ కో కన్వీనర్ మురమళ్ల వెంకటరమణ కేక్‌కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. హరినారాయణరెడ్డి, వెంకటరమణలు మాట్లాడుతూ మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయి హయంలో దేశం విశేష అభివృద్ధిని సాధించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కాకి సత్యనారాయణ, కడిమి మురళీకృష్ణ, మేడపాటి వరప్రసాద్ రెడ్డి, చల్లారెడ్డి, సుధాకర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సుపరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని రంగంపేట బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ నాయకులు ముందుగా వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు మాట్లాడుతూ వాజ్‌పేయి సుపరిపాలన అందించి ప్రజాభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. ఆయన హయాంలో సర్వశిక్ష అభియాన్, పోఖ్రాన్ అణుపరీక్షల నిర్వహణను గుర్తుచేశారు. సీనియర్ నాయకుడు మాణిక్యం మాట్లాడుతూ వాజ్‌పేయి జీవితం ఎంతో మందికి ఆదర్శనీయమని అన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఎం. సాయిరాం మాట్లాడుతూ వాజ్‌పేయి విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండవిల్లి గుప్తా, మండల ఉపాధ్యక్షుడు భాస్కరరావు, సుభద్రంపేట గ్రామ సర్పంచ్ కూటి సాయితాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జననం మహోన్నతం



కరకుదురులో విద్యుత్ అలంకరణలో కాంతులీనుతున్న బాప్టిస్ట్ చర్చి



అనపర్తి సిలువలమ్మ చర్చి వద్ద క్రీస్తు జన్మ జననం సెట్టింగు



బూరుగుపూడి లూథరన్ చర్చిలో..



కోరుకొండ ఆర్‌సీఎం చర్చిలో వాక్య సందేశాన్నిస్తున్న రెవరెండ్ పాదర్ మాణిక్యం

మధురపూడి: కోరుకొండ మండలంలోని లూథరన్, ఆర్‌సీఎం, పెంతుకొస్తు, బైబిల్ మిషన్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులంతా త్యాగానికి ప్రతీకైన ఏసుక్రీస్తును ఆరాధించారు. బూరుగుపూడి లూథరన్ చర్చి యూత్ ఆధ్వర్యంలో ఉదయం ప్రదర్శన నిర్వహించారు. చర్చి రెవరెండ్ పాస్టర్ ఇస్రాయేల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాపవరం బైబిల్ మిషన్ చర్చిలో క్రిస్టియన్, మైనార్టీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు, రెవరెండ్ బిషప్ నక్కా ఆనందకుమార్ ఆధ్వర్యంలో 52వ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రెవరెండ్ డాక్టర్ సత్యానందం స్థాపించిన చర్చిలో వృద్ధులు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. విశాఖపట్నానికి చెందిన రెవరెండ్ పాస్టర్ వీఏ థోమాస్ వాక్య సందేశాన్నిచ్చారు. రెవరెండ్స్ ఆనందపాల్, ఆనంద సుధాకర్ పాల్గొన్నారు. స్థానిక ఎస్సార్‌నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ పాదర్ మాణిక్యం వాక్య సందేశాన్నిచ్చారు. ఉపదేశి బెల్లపు డేవిడ్, పశ్చిమ గానుగూడెం సెంటినరీ సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చి రెవరెండ్ పాస్టర్ ఎస్.కృపావిల్సన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. బూరుగుపూడి లూథరన్ చర్చి డెలికేట్ బోయ మార్టిన్, కోశాధికారి పిట్టా కృష్ణ, మేకల ప్రతాప్‌కుమార్, ఇంజే విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతానగరంలోని ఇవాంజికల్ లూథరన్ చర్చిలో పాస్టర్ అంజరయ్య ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కల్వరి స్తుతి మందిరంలో క్రిస్మస్ వేడుకలను సంఘ కాపరి కొల్లి నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రీస్తు జన్మదినం సందర్భంగా గీతాలాపన, బైబిల్ స్టడీ వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్ నారాయణరావు మాట్లాడుతూ సమస్త మానవాళి రక్షణ కోసం ఏసు ప్రభువు మానవునిగా జన్మించారన్నారు. అలాగే మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

క్రిస్మస్ శోభ

పెదపూడి: క్రిస్మస్ వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని పెదపూడి, దోమాడ, కరకుదురు, రామేశ్వరం, ఏపీత్రయం, జి.మామిడాడ, పెద్దాడ, సంపర, కాండ్రేగుల, పైన, పుట్టకొండ, రాజుపాలెం, చింతపల్లి, వేండ్ర, శహపురం, కుమారప్రియం గ్రామాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం, మధ్యాహ్నం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఏసుక్రీస్తు పుట్టుకపై సందేశాన్ని ఆయా పాస్టర్లు ఉపదేశించారు. సాయంత్రం కుటుంబ సభ్యులంతా క్రిస్మస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయాలను విద్యుత్ అలంకరణలతో సుందరంగా అలంకరించారు. క్రీస్తు పుట్టుకకు సంబంధించిన గీతాలను భక్తులు ఆలపించారు. చిన్నారులు, యువత, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అనపర్తిలో..

అనపర్తి మండల పరిధిలోని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనపర్తి సిలువలమ్మ చర్చిలో పాస్టర్ వెంకటేష్ క్రీస్తు జననం గురించి ఉపదేశించారు. చర్చి ఆవరణలో పశువుల దొడ్డిలో క్రీస్తు పుట్టుకను తెలియజేసే విధంగా బొమ్మలతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చర్చిని సుందరంగా అలంకరించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పెదపూడి: లోక రక్షణ కోసం ఏసుక్రీస్తు పుట్టాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం చిన పాలమూరు గ్రామంలోని పెంతెకోస్తు చర్చిలో మంగళవారం రాత్రి జరిగిన క్రిస్మస్ ఆరాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథి సూర్యనారాయణరెడ్డి, స్థానిక చర్చి పాస్టర్ కె.జాన్‌పాల్‌లు కేక్ కట్‌చేసి వేడుకలు ప్రారంభించారు. క్రైస్తవ భక్తులకు మాజీ ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసు క్రీస్తు అనుసరించిన మార్గంలో అంతా పయనించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను చర్చి పాస్టర్ జాన్‌పాల్, పెద్దలు యూత్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

బిక్కవోలు: శాంతికి, త్యాగానికి ప్రతీకగా క్రిస్మస్ పండగను నిర్వహిస్తున్నట్లు బలభద్రపురం పాస్టర్ విజయకుమార్ అన్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా బలభద్రపురం, తొస్సిపూడి, కొమరిపాలెం, పందలపాక గ్రామాల్లో క్రీస్తు సందేశం తెలుపుతూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ ఉన్నంతలో ఎదుటివారికి సాయం చేయాడంలోనే దైవత్వం ఇమిడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని పలు చర్చిల్లో ప్రార్థనలు చేశారు.



చినపాలమూరు చర్చిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



పందలపాకలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు